# విచిత్ర రహస్యం

"ఏమిటి సంగతి? మళ్ళీ వచ్చావేం?" అని ఆశ్చర్యంతో కనుబొమలు పైకి ఎగరేస్తూ అన్నాడు ఇన్‌స్పెక్టరు రామచంద్రరావు. నీడలు కనిపించేటట్లు పాలిష్ పెట్టిన క్రాస్‌బెల్టూ, బంగారపుకాంతులు ప్రసరిస్తున్న గుండీలూ ఆయన 'హోదాని' చాటిస్తున్నయ్. అయిదుగజాల దూరంనుంచే విగ్రహాలలాగా నిలబడి సలాంచేసి జమాన్లు పిల్లుల్లాగా పక్కకి వెళ్ళిపోవటాన్ని బట్టి ఆయన అధికారబలాన్ని తేలిగ్గా వూహించుకోవచ్చు. తిరిగే పంకాకూడా ఆయనకి భయపడుతున్నట్లుగా మెల్లిగా చప్పుడు కాకుండా కదులుతోంది.

"అయ్యా! నిన్నరాత్రి మునిసిపల్ చైర్మన్ ముకుందరావుని హత్యచేసింది నేనేనండి. నన్ను నిర్బంధించండి. నా అంతట నేనేవచ్చి బుద్ధిపూర్వకంగా లొంగిపోతున్నాను" అంటూ జంకూగొంకూ లేకుండా నిలబడ్డాడు భీమయ్య. పేరులో భీమయ్యైనా ఆకారంలో కాదు. నడికారు మనిషి. నొక్కులుగావున్న నెరిసిన క్రాపూ, వారంరోజులు పెరిగిన గడ్డం, కనుబొమల మధ్య చిన్నప్పుడు పెద్దలు ముద్రవేసిన గుండ్రటి మచ్చా, ఒకసారి ఆ మనిషిని చూస్తే మరచిపోవటం కష్టం.

ఇన్‌స్పెక్టరుగారు మరచిపోలేక పోవడానికి మరీబలమైన కారణం ఇంకోటి వుంది. అందుకే భీమయ్యకేసి చురచుర చూస్తూ 'నీ కిదొక ఆగడంగా వుందే! ఈసారి ఇల్లా వచ్చా

వంటే నిన్ను పిచ్చాసుపత్రికి పంపిస్తాను. జాగర్త! ఇక్కడుంటే మా ప్రాణాలు తీసేస్తున్నావు నిలువునా!" అన్నాడు.

భీమయ్య ప్రాధేయ పూర్వకంగా "కాదు బాబూ! మీకాళ్ళు పుచ్చుకుంటున్నాను. హత్యచేసింది నేనేనండి. నన్ను త్వరగా అరెస్టు చేయించండి" అన్నాడు.

"ఈ ఆటలు నా దగ్గిర సాగవు. ఈసారి జైల్లోవేస్తే తేలిగ్గా బైటపడేమాట వట్టిది. అయినా నువ్వే హత్యచేసినట్లు మాకు నమ్మకం కలిగేదాకా నిన్ను అరెస్టు చెయ్యటానికి వీల్లేదు, ఫో" అని కసురుకున్నాడు.

ఇంతలో కొందరు పోలీసులు నేరస్తులని పసికట్టి పట్టు కోటంలో మంచి తరిఫీదు పొందిన ఒక కుక్క సాయంతో అసలు హంతకుణ్ని గాలించి పెడరెక్కలు విరిచికట్టి లాక్కొని వచ్చారు. విచారించగా హత్యకి ఈమధ్య జరిగిన ఎన్నికల్లో పెరిగిపోయిన కక్షలు కారణమని తేలింది. ఓడిపోయిన పక్షానికి చెందిన వాళ్ళ ప్రోద్బలంతో హంతకుడు ముకుందరావు గారిని నిశిరాత్రి హత్యచేసి పారిపోయారు.

ఇన్‌స్పెక్టరు తోకతొక్కిన తాచులాగా బుసకొట్టి "ఏం భీమయ్యా! నాతో చెలగాటం ఆడితే ఈసారి నిన్ను పిచ్చి ఆస్పత్రికి పంపేస్తాను. ఏమనుకున్నావో! ప్రతిసారి నేనే అని తయారవుతావా?" అని కసురుకున్నాడు.

"నిజంగా నేనే హంతకుడినండీ! నామాట నమ్మండి" అని బతిమాలుకున్నాడు భీమయ్య.

"వ్యాపారం దివాళా తీసినప్పటినుంచీ ఈయనకి మతి సరిగా లేదండి. ఎక్కడ హత్యజరిగినా తనే ఆ హంతకుణ్ణని పరాసరి స్టేషన్‌కివచ్చి చెప్పేస్తాడు సార్ !" అంటూ హెడ్ కాన్‌స్టేబుల్ భీమయ్యని బైటకి గెంటివేశాడు.

"ఈసారివస్తే ఊరికేవదల్ను. తగినశాస్తి చేస్తాను" అంటూ ఇన్‌స్పెక్టరు గట్టినిశ్చయాన్ని వెల్లడించాడు. ఆయనకి ఇంతకోపంరావటానికి కారణం లేకపోలేదు. భీమయ్యమాట నమ్మి అరెస్టు చేసినందుకు ఆయనికి పరాభవం జరిగింది. పై అధికారులవల్ల నానామాటలూ పడ్డాడు. కొన్నేళ్ళ కిందట కాంచనలత అనే చిల్లరవేషాలు వేసిన సినిమాతార హత్య జరిగింది. తనే హత్యచేశానని భీమయ్యవచ్చి లొంగిపోయాడు. నిజమే అనుకొని నిర్బంధంలో వుంచాడు. భోగట్టా చేసేసరికి అసలు విషయం బైటపడింది. ఆ తారకోసం ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ జరిగింది. చాలా కాలంనుంచీ సంబంధంవున్న వాణ్ణి తోసిరాజని కొత్తవాణ్ణి చేరదీసిందనే కడుపుమంటతో పాత విటుడు కాంచనలత ప్రాణం తీశాడు. ద్వేషంగామారిన మోహం భీకర విషసర్పమై ఆమె నిండుప్రాణాలు తీసింది. ఆమె ఆరాధకుల్లో భీమయ్యకూడా ఒకడన్నమాట నిజమే. కాని హత్యతో అతనికేమి సంబంధం లేదని తేలింది. నలుగురి లోనూ ఇన్‌స్పెక్టరు రామచంద్రరావు తల కొట్టేసినట్లయి పోయింది. భీమయ్య తనని గాడిదని చేయటానికి ఈ నాటకం ఆడినట్లు తోచింది. తన విరోధులెవరైనా భీమయ్యకి పురి ఎక్కించి ఇట్లా చేయించారేమోనని అనుమానం కలిగింది.

అయినా ప్రాణిమాటూ ఇదేం వినోదమా? ఎంతప్రమా దంతో కూడిన వినోదం! దీనివల్ల భీమయ్యకి కలిసివచ్చే దేమిటి? మతివున్న మనిషి ఎవరూ ఇటువంటిపని చెయ్యడు.

భీమయ్య మటుకు నిశ్చింతగా వెళ్ళిపోయాడు. ముఖంలో ఎటువంటి భావమూ పొడగట్టలేదు. దాన్నిబట్టి వెర్రికి వెయ్యి విధాలు అనే అభిప్రాయం పోలీసు అధికారు లందరి మనస్సు ల్లోనూ వేళ్ళు నాటుకుంది.

## 2

పగపట్టిన సర్పం భీమయ్య!

ఆ వూళ్ళోనే మూడంతస్తుల మేడలో కులుకుతున్న భూమయ్యా తనూ వీధిబడిలో కలిసి చదువుకున్నారు. ఈనాడు తన కాపురము పూరిగుడిసెలోకి దిగజారిపోయింది. భాగ్య దేవత చెరిగిపోసిన చంద్రనిప్పుల వేడికి తట్టుకోలేక భార్య వెళ్ళిపోయింది. ఒకప్పటి వైభవాన్ని తలుచుకుంటూ కుమిలి కుమిలి కళ్ళుమూసింది.

ఒక్క కొడుకుతప్ప తనకు నా అన్నవాళ్ళు లేరు. వాడికి పెద్దచదువు చెప్పించాల్సిన సమయం వచ్చేసరికి బండి బోల్తా కొట్టింది. పరిస్థితి చతికిలపడింది.

తనని ఉద్ధరించేసినట్లు, తన కేదో మహోపకారం వారి గించినట్లు తన కొడుకు శేఖరానికి ముప్పయి రూపాయల ఉద్యోగం ఇచ్చాడు భూమయ్య.

ఒకప్పుడు సమానహోదాలో మెలిగిన భూషయ్యదగ్గిర తన కొడుకు ఊడిగం చేస్తున్నాడు. ఇప్పుడు భూషయ్య కారులోపోతూ తను దారిలో ఎదురైతే కొరకొరాచూస్తాడు కాని నోరువిప్పి పలకరించడు.

ఈ భూషయ్యకాదా తన సర్వనాశనానికి మూల కారణం? యుద్ధకాలంలో తనని వ్యాపారంలోకి దింపాడు. నష్టం చూపించాడు. తనచేతి ఉన్న పొలమంతా అమ్మించాడు. పెళ్ళాం మెళ్ళో పుస్తెలుతప్ప అన్నీ హరించుకు పోయినయ్.

ఇద్దరమూ మునిగిపోతున్నామని భీమయ్య భ్రమపడ్డాడు, చిన్ననాటి చెలికాడుకదా అని ఎంతో నమ్మకున్నాడు.

కాని భీమయ్యని నట్టేట్లోముంచి ఇట్టే ఒడ్డునతేలాడు భూషయ్య. అంతస్తుల మేడ...పొగాకువ్యాపారం...బియ్యపు మిల్లు అంతా గారడీగాతోచింది. ఒకరికంట కన్నీరుచిందితే కాని ఇంకొకరి యింట పన్నీరు చిలకదుకాబోలు? ఒకరి గుండెల్లో చీకటి ముసురుకుంటేకాని ఇంకొకరి గుండెల్లో వెన్నెల మిసమిసలాడదు కాబోలు!

అప్పటినుంచీ భీమయ్య చిత్రంగా మారిపోయాడు. అతని మనస్సులో ఏముందో ఎవరికి తెలియదు. దారం తెగిన గాలిపటంలాగా కొట్టుకుపోయాడు. ఎక్కడ వుంటాడో, ఎప్పుడు తింటాడో ఎల్లా కాలంగడుపుతాడో ఎవరికీ తెలియదు. కన్నకొడుకుని మాత్రం రోజుకొకసారి కళ్ళారాచూచుకొని కడుపులో మంట చల్లార్చుకుంటాడు.

ఒకసారి కొడుకు చదువుకోసం రెండువేలు అప్పుగా యిమ్మని భూషయ్యదగ్గరికి వెళ్ళాడు. ఎదురుగా సోఫాలు ఖాళీగావున్నా కూచోమనలేదు. "ఏమిటి? రెండువేల అప్పా! నీకా ?" అని హేళనగా నవ్వాడు. భీమయ్యగుండెలు భగ్గున మండిపోయినయ్.

"కాని కాలంవస్తే పైపంచ పామై కరుస్తుంది." అనుకుంటూ మెదలకుండా వెళ్ళిపోయాడు.

అప్పటినుంచీ భూషయ్య ముఖం చూడలేదు. ఆ గడప తొక్కలేదు.

అప్పటినుంచీ ఏమూల హత్య జరిగినా తనే హంతకుణ్ణనిచెప్పి పోలీసుల దగ్గరికి వెళ్తాడు. ఈ వింత ప్రవర్తనకి మతి చాంచల్యమే కారణమా? అతని అంతరంగంలో ఏమున్నదో అంతర్యామికి తప్ప ఇంకెవరికీ తెలియదు.

## 3

ఆ వార్తవిని పట్టణమంతా అట్టుడికిపోయింది. భూషయ్య రోజూ పడుకునేముందు పాలు తాగేవాడు. ఆ రాత్రి పాల గ్లాసు పట్టుకుని వెళ్ళినకూతురు కోమలి ఆ రక్త ప్రవాహంచూసి కళ్లు తిరిగిపోయి "నాన్నా" అని కేకవేసి స్పృహతప్పి పడిపోయింది.

తోటమాలీ నౌకరూ వంటమనిషి అంతా పరుగెత్తుకొచ్చారు. తోటలో చీకట్లో ఒకమూలనక్కివున్న శేఖరాన్ని

అనుమానంమీద పట్టుకున్నారు. వెంటనే పోలీసులకి టెలిఫోను చేశారు.

అంతచీకట్లో అక్కడికివచ్చి తోటలో దొంగలాగా నక్కి కూచున్నందువల్ల అందరికి శేఖరం మీదనే అనుమానంగావుంది. అతని దగ్గర ఆయుధాలేమీ కనబడలేదు. చేతులమీద ఒక్క రక్తపు మరకకూడా లేదు, కానిఆవేళప్పుడు అక్కడికి శేఖరం ఎందుకు రావాలన్నదే అందరికీ ప్రశ్న.

దానికి తనే కారణమని చెప్పగల ధైర్యం కోమలికి లేకపోయింది. కొన్నాళ్ళనుంచీ తను రహస్యంగా శేఖరాన్ని మల్లెపొద దగ్గర కలుసుకున్నట్లు వెల్లడిచేయగల సాహసం కోమలికి లేకపోయింది.

తను వచ్చిన హేతువు నలుగురిలోనూ చెప్పి తనకి మనసిచ్చిన కోమలిని అవమానపరచడం శేఖరానికి సుతరామూ ఇష్టంలేకపోయింది. ఎవరెన్ని ప్రశ్నల బాణాలతో గుచ్చినా చలనంలేని రాయిలాగా నిలబడి పోయాడు. జరిగిన ఘోరానికి నిశ్చేష్టుడైపోయి నోట మాటరాక దిక్కులు చూస్తూ వుండిపోయాడు.

ఆరోజు సాయంకాలం ఆఫీసులో భూషయ్య గుమస్తాలందరి ముందూ శేఖరాన్ని అనవసరంగా మాటలు మిగిలాడు. నీకు పని చేతకాదు. నీకు జీతం ఇవ్వటం దండగ అని దురుసుగా అనేశాడు. అభిమానం చంపుకోలేక, అవమానం సహించలేక అప్పటికప్పుడే శేఖరం తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాడు. "ఏం చూసుకుని నీకింత తలపొగరు?"

అని భీమయ్య గర్జించాడు. "ఇంత విశాల ప్రపంచంలో బతక లేకపోను లేవయ్యా ! ...అని గట్టిగాఅనేసి శేఖరం బైటికి వెళ్ళిపోయాడు

ఈ సంఘటన శేఖరంమీద అనుమానాలకి మరింత బలం ఇచ్చింది. వెంటనే సంకెళ్ళువేసి శేఖరాన్ని స్టేషనునికి తీసుకు పోయారు.

మర్నాడు పొద్దున్నే భీమయ్య పోలీసు స్టేషనుకి వెళ్లాడు. "బాబూ నేనే ఈ హత్య చేశానండీ !" అని అధికారి రామ చంద్రరావుకి విన్నవించుకున్నాడు.

ఆయన ఉగ్రుడై పోయి "మళ్ళీవచ్చావా ? అంటూ కుర్చీలోంచి లేచి జుట్టు పట్టుకొని రెండుచెంపలూ వాయించి సంకెళ్లువేయించి ఎండలో నిలబెట్టించాడు. "ఇదేం తమాషా అనుకున్నావా ?" అని కళ్ళతో నిప్పులు కురిపించాడు.

"నిజం బాబూ ! నామాట నమ్మకపోతే నేనేం చెయ్యను ?" అని గొణుగుతూ ఎండలో నిలబడ్డాడు.

పక్కనేవున్న చీకటిగదిలోంచి "కొట్టకండి బాబూ, చంపెయ్యకండి. నిజం చెబుతున్నాను. నేనేపాపమూ ఎరగను" అనే అరుపులూ ఏడుపూ దీనంగా వినబడున్నయ్. పశువుని బాదినట్టు కొట్టే దెబ్బలు ఛెళ్లున మోగుతున్నయ్. కంఠం చాలా పరిచితంగా వినిపించి ఎవరాఅని ఆలోచిస్తున్నాడు.

ఇంతలో ముక్కులోంచి నెత్తురు వరదలు కారుతున్న మనిషిని తెచ్చి పోలీసు జవాన్లు అధికారిముందు నిలబెట్టారు. ఆపాదమస్తకమూ గబగబా వణికిపోతున్నాడు. గుడ్డలన్నీ

నెత్తురుతో తడిసి పూచిన తంగేడులాగా వున్నాడు. ఎవరూ ? కళ్ళు పెద్దవిచేసి చూశాడు. అనుమానంలేదు. శేఖరమే. తన శేఖరమే !

"తండ్రీ !" అని అరుద్దామంటే భీమయ్య కంఠం తడి ఆరిపోయి మాట పెగిలిరాలేదు. కళ్లుతిరిగిపోతున్నయ్. కాళ్ళు పట్టుతప్పిపోతున్నయ్. కాళ్ళకింద నేల రసాతాలానికి అణగారి పోతోంది, పడిపోతానేమోనని భయంతో పక్కనున్న వేప చెట్టుకి ఆనుకున్నాడు.

శేఖరం ముఖాన నీళ్ళుజల్లి, మంచినీళ్లు తాగించి మళ్ళీ దారుణంగా కొట్టటం మొదలుపెట్టారు. చెయ్యని నేరం కోసం చిత్రహింసకి గురిఅవుతున్న కన్నకొడుకుని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. ఇన్నేళ్ళనుంచి తను వేసిన పన్నాగం భగ్నమైపోయింది. తను పన్నిన వలలో నిరపరాధియైన కన్న కొడుకు చిక్కుకొన్నాడు. చెయ్యని నేరంకోసం మొయ్యలేని శిక్ష మీద పడబోతోంది. భీమయ్య తలమీద పిడుగు పడి నట్లయింది. మానవుల సంకల్పాలకి తారుమారుచేసే బలీయ మైన అదృశ్యశక్తి ఎక్కడో వున్నదనే సత్యం మెరుపులాగా మనసులో తళుక్కుమన్నది. అంతా జయప్రదంగా ముగించా నని మురిసిపోయే సమయంలో అనుకోకుండా అంతా తలకిం దులై పోతోంది.

"బాబూ ! వాణ్ణి చంపకండి. ఈసారి మాట నమ్మండి నిజంగా హత్యచేసింది నేనే ! వాడు నిర్దోషి వాణ్ని బాధించ ండి" అని కాళ్ళమీదపడ్డాడు. ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు

బూటుకాలుతో తన్నబోయి భీమయ్య కళ్ళతో నిండితొణికే బాష్పాలుచూసి తమాయించుకున్నాడు.

"నిజం చెబుతున్నానుబాబూ! నా మూలంగా ఈ నిర్దోషి బాధలు పడుతున్నాడు. ఈ హత్యచేసినది నేనేనండి. దీని కోసం నేనే పదేళ్ళనుంచి కలవరిస్తున్నాను. నిజంగా హత్య చేసినప్పుడు నామీద ఎవరికీ అనుమానం లేకుండా వుండాలని ఆశించాను. అందుకే చెయ్యని హత్యలన్నీ, నేనే చేశానని నెత్తి వేసుకొనేవాడిని, నిజంగా హత్యచేసినప్పుడు కూడా ఎప్పటిలాగేవచ్చి ఒప్పుకుంటేపిచ్చివాడనిచెప్పి పొమ్మంటారని అనుకున్నాను. కాని ఇల్లా జరుగుతుందనుకోలేదు. నా పథకం నాకన్న కొడుక్కే ప్రాణాంతకంగా పరిణమిస్తుందని కలలో నైనా అనుకోలేదు బాబూ!" అని రామచంద్రరావు పాదాలు పట్టుకున్నాడు.

"నిజంగా నువ్వే చేశావా నాన్నా?" అని శేఖరం ఆవురుమన్నాడు.

"నేనే ముమ్మాటికీ నేనే. నన్ను సర్వనాశనం చేసిన ఆ దుర్మార్గుణ్ని తుదముట్టించాను. నాకడుపుమంట చల్లారింది. మీకు అనుమానంగావుంటే మా గుడిసెదగ్గిర మామిడి తోపులో ఈశాన్యమూల రక్తంతో తడిసిన గుడ్డలూ, హత్య చేసిన పదునుకత్తీ పాతిపెట్టి వచ్చాను. వెళ్ళి చూసుకోండి. నన్ను న్యాయస్థానానికి పంపండి. నాకు మీ యిష్టం వచ్చిన శిక్ష వెయ్యండి. నాకన్న తండ్రిని విడిచిపెట్టండి. వాడు నిరపరాధి..." అని గద్గత స్వరంతో అన్నాడు భీమయ్య.

ఇన్‌స్పెక్టరు రామచంద్రరావు అంతావిని ఆశ్చర్యంతో మునిగిపోయాడు.

"బాబూ అంత చీకట్లో భూషయ్య ఇంటికి ఎందుకు వెళ్ళావురా ?" అని బుజ్జగిస్తూ అడిగాడు

శేఖరం తలవంచుకున్నాడు.

"చెప్పవేరా నాయనా ?" అని గడ్డం పుచ్చుకున్నాడు. కన్నీళ్ళు గిర్రున తిరిగినయ్. లాఠీ దెబ్బలు బైటికి లాగలేని సత్యం ఒక్క-లాలింపుతో వచ్చింది.

"కోమలికోసం వెళ్ళాను, నాన్నా. నిన్నరాత్రే మేమిద్దరం ఏదైనా దూరదేశానికి వెళ్ళిపోయి సుఖంగా పెళ్ళి చేసుకుందామని ఆశపడ్డాం" అని మెల్లిగా బైటపెట్టాడు శేఖరం.

"మనల్ని సర్వనాశనంచేసిన ఆ దుర్మార్గుడు కూతురితో నీకు పెళ్ళా ?..." అని గర్జించాడు భీమయ్య. శేఖరం వంచిన తల ఎత్తలేదు. సామ్రాజ్యాన్ని కోలుపోయిన చక్రవర్తిలాగా దిగాలుపడి కూచున్నాడు.

కొంచెం సేపు గుక్క-తిప్పుకుని భీమయ్య శేఖరం తల చేతుల్లో నిమిరి "చూడు నాయనా ! ఈ లోకంలో లోకం ఎంత చిత్రమైందో ! ప్టుపడకుండా హత్య చెయ్యాలని కలలు కని చివరికి నా అంతట నేనే దొరికిపోయాను. పరమ శత్రువులు నేను భావించిన వాడి కూతుర్నే నువ్వు ప్రేమించి పెళ్ళాడతానంటున్నావు ! అనుకున్న దొకటీ జరిగింది మరొకటీ ! మంచిది బాబూ ! నీ యిష్టమే నా యిష్టం ! నీ ఆనందమే నా ఆనందం ! నాదేముంది? వెళ్ళిపోతున్నాను. ఉరిస్తంభం ఎప్పుడు రమ్మంటే అప్పుడు ! ఇవాళ నా మనసెంతో

పొంగిపోతోంది. ఎన్నడూ లేని ఆనందంతో తేలిపోతోంది. నా శత్రువుని తుదిముట్టించాననే విజయగర్వంతో కాదు. ఈ లోకంలో రోషాలూ ద్వేషాలూ కలకాలం నిలవనది నిజం ఇప్పుడు తెలుసుకున్నాడు. కలకాలం నిలిచేది ఒక్కటేరా బాబూ!"

"ఏమిటి నాన్నా ?" అని తండ్రి ముఖంలోకి ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు శేఖరం.

ప్రేమరా తండ్రీ! అబద్ధాలు అలవాటైన నా నాలుకతో ఇవాళ నిజం పలికించింది. అన్ని దెబ్బలు తిన్నా నిజాన్ని నీలోపలే దాచుకునేట్లు చేసింది!" అంటుంటే భీమయ్య కంఠం వణికిపోయింది. కన్నీళ్ళతో చెక్కిళ్ళు తడిసిపోయినయ్

"అక్కడే దొరికినయ్ సార్! ముసలాడే ఖూనీచేశాడు" అంటూ హెడ్ కానిస్టేబులు కత్తినీ, గుడ్డలనీ తీసుకొచ్చి అధికారి ముందుపడేశాడు.

"నేను చెపితే విన్నారా?" అంటూ భీమయ్య అధికారి వైపు చూశాడు.

"ఇంత చిత్రమైన కేసు నా సర్వీసులో యెన్నడూ ఎరగను" అంటూ అధికారి కుర్చీలోంచి లేచాడు.

తండ్రికొడుకులు ఒకళ్ళకేసి ఒకరు చూసుకుంటూ మెదలకుండా కూచున్నారు.

నేనుమాత్రం ఆగనంటూ గోడగడియారం కదిలిపోతోంది!

---